నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల
గురువారం | 25 జనవరి 2024 పేజీలు 8



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆడపిల్లను పుట్టనిద్దాం..

# చదవనిద్దాం

**- కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**
బాలికలను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దామం అనే భావనతో బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్రతి ఒక్కరికి జాతీయ బాలిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనుషుల ఆలోచనా విధానంలో ఆడపిల్ల అంటే కేవలం బానిసత్వం, బరువుగా చూసే మనస్తత్వం నుంచ బయటకు ప్రయత్నాల్లో భాగంగానే జాతీయ బాలిక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రతిరోజు మన జీవితం పోరాటమేనన్నారు. మన అస్తిత్వాన్ని మనమే పోరాటం చేసి కాపాడుకోవాల్సిర అవసరం ఎంతైనా ఉందన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలను మిగతా 2లో



మూడు పార్టీల జెండాలు

# కాంగ్రెస్ వైపు అసంతృప్తులు..!

- టికెట్ ఆశించి భంగపడ్డ వారికి ప్రత్యామ్నాయం
- ప్రధానంగా వైసీపీ నేతల్లో ఆందోళన

**కర్నూలు, సూర్య ప్రతినిధి:**
జిల్లాలోని వైసిపి, తెలుగుదేశం పార్టీల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ కనిపిస్తోంది. రెండు ప్రధాన పార్టీల్లోనూ ఆశావాహులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. అయితే రెండు ప్రధాన పార్టీల్లోనూ ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో టికెట్ సంపాదించుకున్న వారు మాత్రం ఈ పరిణామాల పట్ల ఆందోళనతో ఉన్నారు. జిల్లాలోని ఏడు శాసన సభా నియోజకవర్గాల్లోనూ వైసిపి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఇందులో ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ప్రకటించగా కర్నూలు ఇన్‌చార్జిపై ప్రస్తుతం పార్టీలో చర్చ సాగుతోంది. ఇక కర్నూలు లోక్‌సభ స్థానానికి మంత్రి గుమ్మనూరు జయరాంను అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆయన ఇందుకు సుముఖంగా లేరని స్పష్టమైంది. జయరాం సైతం తుది వరకు వేచి ఉంటానని అప్పటికీ పార్టీ నిర్ణయంలో మార్పు రాకపోతే మిగతా 2లో

సీఎంవో నుండి

# ఎమ్మెల్యేకు పిలుపు..!

- అభ్యర్థి మార్పుపై వైసీపీలో ఉత్కంఠత
- బుట్టారేణుక వైపే అధిష్టానం మొగ్గు
- బుట్టాను అంగీకరించకపోతే ఎమ్మెల్యే మదిలో ఎవరున్నారు..?
- వైసీపీలో మార్పులపై టీడీపీలోనూ టెన్షన్



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



మాచాని వెంకటేష్



బుట్టా రేణుకా

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ :**
ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి మార్పుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి మరో మారు పిలుపు వచ్చింది. గత నెల సిట్టింగ్ ఎమ్మెల్యేకు పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 'నో' చెప్పి బీసీ అభ్యర్థి పేరు సూచించాలని చెన్నకేశవరెడ్డికే అవకాశం కల్పించిన విషయం విధితమే. అధినేత సూచన మేరకు పట్టణానికి చెందిన ఇంజనీర్ మాచాని వెంకటేష్ పేరును సూచించడం, అందుకు ముఖ్యమంత్రి కూడా అంగీ కరిస్తూ ఇంఛార్జ్‌గా నియమించిన సంగతి తెలిసిందే. అయితే మాచాని వెంకటేష్ అభ్యర్థిత్వాన్ని వైసీపీ నాయకులు, క్యాడర్ ఎమ్మెల్యే ముందు తలలాడిస్తూ బయటకు వచ్చి ముక్తకంఠంతో తిరస్కరిస్తుండటంతో పాటు అధిష్టాన పెద్దలకు ఫోన్లు చేసి అభ్యర్థిని మిగతా 6లో

జనజాతర...

# శ్రీ నీలకంఠుడి జాతరోత్సవం

- శనివారం మహా రథోత్సవం
- క్రీడల ఉత్సాహం.. రైతుల సంబరాలు
- పౌరాణికానికి పెట్టింది పేరు.. దుమ్ము రేపనున్న 'రేలారేలారే'
- ఆడపడుచుల ఆనందహేళ.. పాత జ్ఞాపికలకు వేదిక
- మత సామరస్యానికి ప్రతీక.. మాసంతం కళకళ



ఉత్సవ మూర్తుల దర్శనం అందించే మహారథం

**ఎమ్మిగనూరుప్రతినిధి, మేజర్‌న్యూస్ :**
పుష్యమాసం వచ్చిందా.. పౌర్ణమి అయిన రెండురోజులకు ఆక్కడ జరిగే జాతర ఉత్సవం.. నెల రోజులు పండగ వాతావరణం చేనేతపురి ఎమ్మిగనూరు ఇలవేల్పు శ్రీ నీలకంఠుడి జాతర .. శనివారం మోదలైతే మాసంతాం వరకు సంబరమే.. సంబరం. ఉత్సవానికి ముందు నెలరోజు ఉత్సవం తర్వాత నెలరోజులు యువతను ఉత్తేజ పరిచే క్రీడా సమరాలు.. రైతన్నలకు ఆహ్లాదం అందించే వృషభరాజుల బలప్రదర్శనతో రైతు సంబరాలు.. పౌరానిక నాటకాలకు పెట్టింది పేరు ఎమ్మిగనూరుజాతర.. ఇకజానపద గేయాలాపణతో దుమ్ము రేపుతామంటున్న రేలారెలారే పాటలు.. కేరింతలు కొట్టించే ఎగ్జిబిషన్.. చేనేతపురిలో శ్రీ స్వాముల జాతర అంటే మిగతా 2లో

రాజకీయ రుద్రుడు

# ఇస్తే వరం... పెడితే శాపం

- కోడుమూరు రాజకీయ చదరంగంలో 'విష్ణు' కీలకం



**కోడుమూరు, మేజర్‌న్యూస్:**
స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపుతో యువనేతగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో రాజీ అనేపదం ఆయన కలలోకూడ రావాలంటే జడుసుకోవాల్సిందే. స్వపక్షానికైనా, మిత్రపక్షానికైనా, వైరిపక్షానికైనా ఆయన ఇస్తేవరం పెడితేశాపమే. ఒకసారి నాది అనుకుంటే ఎంతదూరమైనా వెల్లి సాదించడం ఈ రాజకీయరుద్రుడు నైజం. నా అనుకున్నవారికి అన్యాయం జరిగితే కాళరుద్రుడై రంగంలోకి దిగుతాడు. రాజకీయ చదరంగంలో ఆయనకు ఆయనేసాటి. దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశం పిలుస్థోంది రా కదిలిరా అన్న పిలుపుతోనే ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు విష్ణును యువనేతగా ఆదరించడంతో మిగతా 6లో

సూర్య



# ఆడపిల్లను పుట్టనిద్దాం.. చదవనిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

చూడాలన్నారు. సెక్యువల్ హెరాస్మెంట్ కమిటీ చైర్మన్ మాధవిశ్యామల, దిశా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, పీసీపీఎన్‌డిటీ నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్, డెమో ప్రమీల పాల్గొన్నారు.

## వాటర్ గ్రిడ్ ట్రయల్ రన్ విజయవంతం



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** డోన్ నియోజకవర్గంలోని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన త్రాగునీరు అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకం కింద రూ.350 కోట్లతో పైప్ లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మండలంలోని బుగ్గానిపల్లె తాండ వరకు నీటి సరఫరాకు సంబంధించి ట్రైల్ రన్ బుధవారం విజయవంతమైనది. ఈ నెల 29న మొదట బేతంచెర్ల పట్టణానికి త్రాగునీటిని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తుండటంతో నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, సీఐ ప్రియతమ రెడ్డి, ఎస్సై శివ శంకర్ నాయక్, మెగా కంపెనీ ఇంజనీర్ వాసు, ఏర్పాట్లను పరిశీలించారు.

## విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అవసరం

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టి.మరియదాసు అన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్లో గణతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపారు.విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. రంగవల్లులు, పోటీలు కబడ్డీ, వాలీబాల్ మొదలైన క్రీడలు నిర్వహించారు. బాలికలు రంగోలిలో భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే విధంగా రంగురంగుల చుక్కల ముగ్గులను వేసి అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గణతంత్ర దినోత్సవం రోజు బహుమతులు ప్రధానం చేస్తామని ప్రిన్సిపాల్ మరియదాసు తెలిపారు.ఈ కార్యక్రమంలో నజ్జు, మల్లీశ్వరి వెంకటలక్ష్మి, భాస్కర రెడ్డి,నాగరాజు, రామమోహన్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ వైపు అసంతృప్తులు..!

(మొదటిపేజీ తరువాయి)

తనను నమ్ముకున్న కార్యకర్తలు ఏమి చెప్తే అది చేస్తానని పరోక్షంగా పార్టీకి హెచ్చరికలు పంపారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలూరు నియోజకవర్గం నుంచి బరిలో ఉండాలన్న పట్టుదలతో జయరాం ఉన్నారు. అంతేగాక వైసిపిలో తనకు టికెట్ రాకుండా అడ్డుకున్న వారి ఓటమికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పట్టుదలతో ఉన్నట్లు వెల్లడవుతోంది. ఇక మరో మారు కర్నూలు లోక్‌సభ స్థానం నుంచ పోటీ చేయాలని ఆశించిన ప్రస్తుత ఎంపి సంజీవ్ కుమార్ ఆశ నెరవేరకపోవడంతో పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. ఇక ఎమ్మిగనూరు స్థానంలో ప్రస్తుత ఎమ్మెల్యే కేశవరెడ్డి స్థానంలో మొదట మాజీ ఎంపి బుట్టా రేణుకమ్మకు అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచించినా కేశవరెడ్డి అంగీకారం లేకపోవడంతో మధ్యే మార్గంగా ఆయన సూచించిన మాచాని వెంకటేష్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ అధికారిక ప్రకటన చేశారు. అయితే ఆయన అభ్యర్థిత్వం పట్ల పార్టీలో వ్యతిరేకత వచ్చింది. దాంతో పార్టీ పెద్దలు పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. కోడుమూరు నియోజకవర్గంలో సైతం ప్రస్తుత ఎమ్మెల్యే సుధాకర్‌ను కాదని మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరుడు సతీష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే సుధాకర్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా కర్నూలు శాసన సభా స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన రెడ్డి మధ్య ఇన్‌చార్జి పదవి దోబూచులాడుతోంది. ఇక్కడి నుంచి టికెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి. ఇక పత్తికొండ, మంత్రాలయం, ఆదోని స్థానాల్లో మార్పు ఉండదని ప్రస్తుత ఎమ్మెల్యేలు మరో మారు బరిలోకి దిగుతారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి జయరాం విముఖంగా ఉండటంతో ఆ స్థానం నుంచి కర్నూలు మేయర్ బివై రామయ్య, మాజీ ఎంపి బుట్టా రేణుకమ్మ పేర్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడవుతోంది. మరో వైపు రేణుకమ్మ పేరు మరో మారు ఎమ్మిగనూరు విషయంలో కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇక మంత్రి జయరాం ఈ నెల 29వ తేదీన తన భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఆలూరు నుంచి పోటీ చేయడం ఖాయమని వారు వెల్లడిస్తున్నారు. కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్ సైతం కాంగ్రెస్ వైపు ఆలోచిస్తున్నా తుది నిర్ణయం తీసుకోవడానికి ఇంకా కొంత కాలం వేచి ఉంటారని స్పష్టమవుతోంది.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో తన మాట కాదని పార్టీ నిర్ణయం తీసుకుంటే ఎమ్మెల్యే కేశవ రెడ్డి నిర్ణయం కూడా వైసిపిని ఇబ్బంది పెట్టేలా ఉంటుందని భావిస్తున్నారు. కర్నూలు శాసన సభా స్థానంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వైసిపి పరిస్థితి ఇలా ఉంటే టిడిపి టికెట్లను ఖరారు చేసినా అధికారికంగా మాత్రం ఇప్పట్లో ప్రకటించబోదని వెల్లడవుతోంది. ఆ పార్టీలో పోటీ చేసే వారికి ఇప్పటికే చెప్పారని వారు తమ వంతు కార్యక్రమాలు చేపట్టాలని సూచించినట్లు వెల్లడవుతోంది. టిడిపి నుంచి దాదాపు పాత వారే పోటీలో ఉంటారని ఒకటి, రెండు చోట్ల మార్పులు ఉండే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ స్థానాలో ఆశావాహులు తమకు వ్యతిరేకంగా నిర్ణయం వెలువడితే తప్ప ఇపుడే ఎలాంటి ఆలోచన చేసే అవకాశం లేదని స్పష్టమవుతోంది. అంతేగాక వారు కాంగ్రెస్‌లో చేరినా తమకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదని టిడిపి నేతలు ధీమాతో ఉన్నారు. వైసిపిలో మాత్రం షర్మిల కారణంగా తమ పార్టీ ఓటు బ్యాంకుకు ఇబ్బందులు వస్తాయన్న ఆందోళన కనిపిస్తోంది. దీన్ని ఎదుర్కొని కాంగ్రెస్ కారణంగా పార్టీకి నష్టం లేకుండా ఎలా అడుగులు వేయాలన్న అంశంపై ఆలోచనలో ఉన్నారు.

# విద్యార్హత లేని వారికి ఉద్యోగాలు

### – దిశా వన్‌స్టాప్ సెంటర్ అవినీతిమయం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** దిశా వన్‌స్టాప్ సెంటర్ అవినీతిమయంగా మారిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి విద్యార్హత, అనుభవం లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శలు గుప్పుమంటున్నాయి. కర్నూలు జిల్లా మహిళాఅభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో దిశా వన్‌స్టాప్ సెంటర్ ఒకటి. ఈ సెంటర్ ద్వారా బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టడం, బాల్య వివాహాలను నియంత్రించడం, బాలిక చట్టాలపై అవగాహన కల్పించడం, వారిలో చైతన్యం తీసుకరావడం జరుగుతుంది. అయితే ఈ సెంటర్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి ఎటువంటి విద్యార్హత, అనుభవం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు అమ్యామ్యాలు దండుకొని ఎటువంటి విద్యార్హత, అనుభవం లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. దీంతో దిశా వన్‌స్టాప్ సెంటర్ లక్ష్యం కాస్త నీరుగారిపోతుంది. ఈ వ్యవహారం జిల్లా కలెక్టర్‌కు తెలిసినా ఆమె కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




దిశా వన్‌స్టాప్ సెంటర్

# జనజాతర.. శ్రీ నీలకంఠుడి జాతరోత్సవం..!!

(మొదటిపేజీ తరువాయి)

ఆడపడుచులకు ఆనందమే.. ఈ ఆనందంలో పాతజ్ఞాపకాలు నెమరవేస్తూ స్నేహితుల కలయికతో చట్టాపట్టాలు వేసుకొని జాతరలో కలయతిరడగం వారి ఆనందాలకు అవదలు అనేదే వుండవు.. మతసామ రాస్యానికి ప్రతీకగా ఈ జాతర నిలుస్తోంది. నెరోజులు పాటు వ్యాపారాలన్ని భళా అని కొనసాగుతాయి. 26వ తేది రాత్రి శ్రీ పార్వతి పరమేశ్వర కళ్యాణం, ప్రభోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27వ తేది ఆలయంలో శ్రీ నీలకంఠుడికి రుద్రాభిషేకం, అర్చన, మహ మంగళ హారతి కార్యక్రమాలు ఉదయం జరుగుతాయి. సాయంత్రం 6 గంటల సమయంలో తేరుబజారులో మాచాని కుటుంబం ఆధ్వర్యంలో హోమం నిర్వహించడం జరుగుతుంది. పార్వతి, పరమేశ్వర్లుగా పెద్దలుగా గడిగె కుటుంబం నుండి కుంభం తరలిరాగ ఉత్సవ మూర్తులు మహరథంపై ఆశీనులై పురవీధుల్లో హరహర ధ్వనుల మధ్య దర్శనం ఇస్తారు.



ఎమ్మిగనూరు ఇలవేల్పు
శ్రీ నీలకంఠేశ్వర స్వామి

**★ హరహర ధ్వనుల మధ్య మహరథోత్సవం**

27వ తేది ఆదివారం సాయంత్రం మాచాని కుటుంబీకులు ఉత్సవ విగ్రహాలను మేలతాళాలతో 4 గంటలకు రథాంగ ప్రాంగాణికి తీసుకోచ్చి వేదపండితుల మంత్రోచ్చారణలతో రథాంగహోయం కనులవిందుగా చేపడతారు. అనంతరం గడిగే వారి కుంబం యాగంకు చేరుకోగానే పూజలు చేపట్టి ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులచేసి తండోప తండాలుగా తరలి వచ్చిన జనహోరలో .. హరహర ధ్వనులతో రథోత్సవం కనువిందు చేస్తుంది. శివపార్వతుల దర్శనంతో భక్తులు పునీతులు అవుతారు..

**★ నెల రోజుల జాతర సందడి..**

బుదవారం రథోత్సవం ముగియగానే తేరుబజారులో దుకాణసముదాయలు ఏర్పాటు అవుతాయి.. పుట్టింటి ఆడపడుచులకు చీర .. సారె పెట్టి సాగనంపేందుకు జాతరలో పసుపు, కుంకుమ, గాజులు ,వస్తువులను కొనివ్వడం జరుగుతుంది.. తిన బండారాలు కొదవే ఉండదు.. గృహోపకరణ వస్తువులు అందుబాటు ధరలో ఉంటాయని జాతర వరకు మహిళలు ఎదురుచూసి జాతరలోనే కొనుగోల్లు చేపట్టడం ఆనవాయితీ..



విద్యుత్ కాంతులతో ముస్తాబైన సోమప్ప సర్కిల్

రైతులకు జాతరలో ప్రత్యేక పశువుల సంత ఏర్పాటు ఉంటుంది.. ఇక్కడ ఒంగోలు జాతి ఎద్దులు అమ్మకానికి ఉంటాయి. కర్రసామాన్లు, సేద్యపు పనిముట్లు అందుబాటులో ఉండటం ప్రత్యేకత.

**★ కదిలిరానున్న అతిరథ మహరథులు**

ప్రతి ఏటా జరిగే శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు ఆదివారం మహ రథోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుండి అతిరథ మహరథులు కదిలివస్తారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో జాతర ఉత్సవంలో ఆయా పార్టీల రాజకీయ నేతలు హజరు కానున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీ.వీ జయనాగేశ్వర రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యాక్షులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైసీపీ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, టిటిడి బోర్డు డైరెక్టర్, వై. సీతారామిరెడ్డి, వై. రుద్రగౌడ్, బసిరెడ్డి, మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ప్యాలకుర్తి తిక్కారెడ్డి , బిజెపి నాయకులు కెఆర్ మురారి రెడ్డి, జనసేన నాయకులురాలు రేఖాగౌడ్, చల్లా వరుణ్‌తో పాటు తదితరులు హాజరు అవుతున్నట్లు సమాచారం.

**★ భారీ బందోబస్తు**

జాతర సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి సీతారామయ్య, సీఐలు మధుసుధన్‌రావు, మెహన్‌రెడ్డి, ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

**★ ముస్తాబు అవుతున్న ఎమ్మిగనూరు..**

శ్రీ నీలకంఠేశ్వర జాతర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, కమీషనర్ గంగిరెడ్డిలు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. ఇప్పటికే ప్రదాన రహదారుల వెంట వీదిదీపాలుగా ఫ్లై లైట్లు వెలుతురులు విరజిమ్ముతున్నాయి. ఇటీవలనే బైపాస్ రోడ్డు 2 కి.మీ మేర ఫ్లైలెట్లు వేసి కాంతులు నింపారు.. ఆర్‌టిసి బస్టాండ్ నుండి ప్రదాన కూడలి సోమప్ప సర్కిల్ మీదుగా ట్యాంక్ బండ్ వరకు బిటి రోడ్డు వేశారు.. ప్రదానంగా ఉన్న కూడళ్ల అన్ని విద్యుత్ కాంతులతో జిగేల్ మంటున్నాయి.. తేరు బజారు కూడా ముస్తాబు అవుతున్నది.

# ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యం..

**టిడిపి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అందిస్తాం**
**డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి**



కార్యక్రమంలో పాల్గొన్న మన్నె సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజా సంక్షేమం సమపాలనలో ఉండాలన్నా ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పట్టణ టిడిపి అధ్యక్షుడు చాటకొండ శ్రీనివాసులు ఆధ్యక్షతన పట్టణంలోని 24వ వార్డు నందు బాబుష్యూరిటీ...భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500లు, తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ. 15వేలు తల్లుల ఖాతాలల్లో జమ అవుతాయన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20వేలు ఆర్థికసాయం, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3వేలు, బీసిలకు రక్షణ చట్టం తెచ్చి అన్ని విధాల వారికి అండ, పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులుగా మార్చే కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేయనుందన్నారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో స్థానికుడైన నాకు డోన్‌లో ఎమ్మెల్యే అయ్యేందుకు 50 సంవత్సరాల తరువాత అవకాశం వచ్చింది, కావున నన్ను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు మైనార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆలీబాబా, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఆలా మల్లికార్జునరెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి టిఎన్‌టియుసి అధ్యక్షులు అజీజ్, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు, పట్టణ టిడిపి బీసిసెల్ అధ్యక్షులు చక్రపాణిగౌడ్, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మర్రి ఉపేంద్ర, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌రఫీ, పట్టణ టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సిటీకేబుల్ కిరణ్, నాయకులు పాలరాజు, హుస్సేన్‌పీరా, కోనేటి కాశీవిశ్వనాథ్, హనుమంతరెడ్డి, హ్యుమయున్, చిన్నకాంత్, పెద్దకాంత్, నీలం ప్రభాకర్, తెలుగుయువత కమిటీ నాయకులు ఉడుములపాడు టివి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీసంగుంతల బబ్లూయాదవ్, జ్యోతి వడ్డె శ్రీను, న్యాయవాది లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, సర్దార్ పాష, గుల్షన్, శేఖర్‌గౌడ్, యూనిట్ ఇంచార్జ్ వీరాంజి, పట్టణ కమిటీ నాయకులు నాగేంద్ర, ఐ టిడిపి బిఎడ్. భాష, పార్థసారధిరెడ్డి, మురళీ, డాన్‌శీను, షేక్షా, ఖాజా, కబీర్‌దాస్, సుధ, షాష, మెకానిక్ భాష, షాష, రామాంజినేయులు, ఖాజా, మల్లికార్జున, సురేష్, మధు, బ్రహ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగారుపేటలో కార్డెన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న నాటుసారా

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని బంగారుపేటలో బుధవారం జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో 1,200లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 130లీటర్ల నాటుసారా, 500కేజీల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కర్నూలు టుటౌన్ సీఐ ఇంతియాజ్‌బాష, ఎస్ఐలు ఖాన్, ప్రేమ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 56మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** కర్నూలు రేంజ్‌లో 56మంది ఎస్ఐలు సీఐలు ప్రమోషన్ పొందేందుకు అర్హులని రాష్ట్ర డీజీపీ ప్రమోట్ చేశారు. మంగళవారం కర్నూలు రేంజ్‌లోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన 56మంది ఎస్ఐలను సీఐలుగా పదోన్నతి కల్పించాలని రాష్ట్ర డీజీపీ రెకమండ్ చేశారు. వారు త్వరలో సీఐలుగా పదోన్నతి పొందే అవకాశం ఉంది.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఖలీల్‌అహమ్మద్(ఫైల్‌ఫోటో)

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన ఖలీల్‌అహమ్మద్(60) గత కొంతకాలంగా కల్లూరులో నివాసముంటూ బుధవారం శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖలీల్‌అహమ్మద్ పూడిచెర్ల గ్రామంలో నివాసమంటూ ప్లాట్ల వ్యాపారం చేసేవాడు. అయితే అప్పులబాధ తాళలేక కల్లూరులో నివాసముంటున్నాడు. అయితే అనారోగ్యం కారణంగా తన తండ్రి మరణించాడని అతని కుమార్తె బషీరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మురికి కాలువలు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఎల్‌బీజీనగర్‌లో మురికికాలువలు నిర్మించాలని రాయలసీమ మాదిగ దండరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ గత 6నెలల క్రితం ఎల్‌బీజీనగర్‌లో మురికికాలువల నిర్మాణం కోసం గుంతలు తీసి అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే కాలువల నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమసుందర్, నాగన్న, విజయ్, ఎద్దుల తాగ్యరాజు పాల్గొన్నారు.

# కులగణనకు సాంకేతిక లోపం

**– మొరాయిస్తున్న సర్వర్.. కులగణన తిప్పలు**
**– రాత్రి వరకు గ్రామాల్లోనే సిబ్బంది నిరీక్షణ**



రాత్రి సమయంలో కుల గణన నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి మొదలైన కుల గణన సర్వేకు సర్వర్ సమస్య తీవ్ర అడ్డంకిగా మారింది. గత ఐదు రోజుల నుంచి మండల వ్యాప్తంగా సాంకేతిక లోపం కారణంతో కుల గణన చేపట్టాల్సిన ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ కుల గణన సర్వే నిర్వహిస్తున్నారు. వాలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి యాప్‌లో కుటుంబ వివరాలు నమోదు చేయాల్సి ఉంది. వాలంటీర్ల మొబైల్‌లో జిఎస్‌డబ్ల్యూఎస్ యాప్ ద్వారా ఇంటి యజమాని వేలిముద్ర తీసుకుని వాలంటీర్‌తో పాటు సచివాలయ ఉద్యోగి బయోమెట్రిక్ వేస్తేనే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. ఒక్కొక్క ఇంటి వద్ద సర్వే కోసం సుమారు 30 నుంచి 40 నిముషాలు సమయం పడుతుండగా వాలంటీర్, కుటుంబ యజమాని, సచివాలయ ఉద్యోగి ముగ్గురు కలిసి రెండు సార్లు ఈకెవైసి చేస్తేనే ఆ కుటుంబ కుల గణన పూర్తి అవుతుంది. ఈ సమయంలో సాంకేతిక సమస్యలు రావడంతో నమోదు చేసిన వివరాలతో పాటు అప్లికేషన్ ఓపెన్ కావడం లేదు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల్లోపు మాత్రమే సర్వర్ పని చేస్తుందని మిగితా సమయాల్లో సాంకేతిక లోపాలతో మొబైల్ ఫోన్‌లు పట్టుకుని సర్వర్ కోసం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు వీధుల వెంట తిరుగుతూ ఇళ్ల వద్ద అరుగులపైనే సిగ్నల్ కోసం తంటాలు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిన తరువాత ఎర్రర్ కోడ్ రావడంతో సర్వే పనులు అనుకున్నంత మేరా వేగం పుంజుకోవడం లేదు. తీరా చూస్తే ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, వాలంటీర్లు తమ గ్రామాల పరిధిలో కుల గణన సర్వే కోసం ఉదయం 7 గంటలకే గ్రామంలో వాలిపోతున్నారు. అధికారులు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసే సమయంలో రాత్రి 10 గంటల వరకు గ్రామంలోనే సర్వే కోసం నానా తంటాలు పడుతున్నామని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల గణన కోసం ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో నిర్దేశించిన మేరా చర్యలు తీసుకోకపోవడంతో రోజంతా మొబైల్ పట్టుకుని తిరగాల్సిన పట్టిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది వాపోతున్నారు. ఇళ్ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని అన్నారు. ఉన్నతాధికారులు టార్గెట్‌లు పెట్టి వేధించడం ఆపివేయాలని సిబ్బంది కోరుతున్నారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం- ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

**కౌతాళం, మేజర్‌న్యూస్:** మండలంలోని వల్లూరు గ్రామశివారున గల తుంగభద్ర నది ఒడ్డున పంప్‌హౌస్ వద్ద కర్ణాటక రాష్ట్రం మాన్వి టౌన్ నుంచి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. కోసిగి మండలం కడిదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్‌కుమార్, కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రాగప్పలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16 బాక్సులు (1536 కర్ణాటక ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు), ఒక మోటార్ సైకిల్‌ను, నదిలో రవాణాకి ఉపయోగించిన తెప్పను సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడులు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ సోమల నాయక్, పీసీలు వీరంజి, మద్దిలేటి, రామచంద్ర, వీరేష్, నారాయణలను డీయస్పీ సీతారామయ్య అభినందించారు. గ్రామాలోల ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సూర్యదినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ శంకర్‌శర్మ



**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరంలోని గాయత్రిఎస్టేట్‌లో ఉన్న శ్రీ సాయి గురుదత్త పాలిక్లినిక్‌లో డాక్టర్ శంకర్‌శర్మ సూర్య తెలుగు దినపత్రికల క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య పత్రిక సమాజంలో జరుగుతున్న అనేక అన్యాయాలను ప్రజల ముగింటకు తీసుకవస్తూ అవినీతిపై, ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. రానున్న కాలంలో సూర్యదినపత్రిక ఎన్నో కథనాలు రాసి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు రూరల్ రిపోర్టర్ మధు, శ్రీసాయి గురుదత్త పాలిక్లీనిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ అధ్వరంలోరహదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 100 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు తెలిపారు. పచ్చుదన చేయడం మరొకరికి ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీరన్న, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, బీఫార్మసీ ఎన్ఎస్ఎస్ పిఓ రఘు, వాగేష్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.– సర్ తదితరులు పాల్గొన్నారు.

# పురుషులతో సమానంగా స్త్రీలకు అవకాశాలు కల్పించాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:**

పురుషులతో సమానంగా స్త్రీలకు అవకాశాలు కల్పించినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. బుధవారం నగరంలోని కీర్తన అనాథ ఆశ్రమానికి జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నెలరోజుకు సరిపడే నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల ఉన్న వివక్షతను దూరం చేసేందుకే ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికలను కూడా బాలురతో సమానంగా చూడాలన్నారు. అప్పుడే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# వైసీపీ గూటికే ఆగవెలి ఉప సర్పంచ్



**క్రిష్ణగిరి ,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఆగవెలి గ్రామ ఉప సర్పంచ్ బోయ రాముడు తిరిగి వైసీపీ పార్టీలోనే చేరారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ సమక్షంలో బుధవారం ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత 6 రోజుల క్రితం వైసీపీ నుండి టీడీపీ పార్టీలో చేరిన ఆయన మళ్లీ వైసీపీ పార్టీలోనే తాను కొనసాగుతున్నట్లు తెలిపారు.తనతో పాటు వెళ్లిన వారందరిని కూడా తిరిగి వైసీపీ పార్టీలోనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# రథానికి పూజలు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఈ నెల 27న ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త శ్రీ మాచాని నాగరాజు నీలమురళీధర ఆధ్వర్యంలో మహారథంచక్రం కట్టుటకు పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ ఎఫ్ ఎఫ్ ఎం డైరెక్టర్ మాచాని శివశంకర్, మాచాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దృశ్యం

# తెలుగుదేశం పార్టీలో చేరిన బీసీ కాలనీవాసులు



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన యువత బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అధికార వైసీపీలో వారు ఇమడలేక టీడీపీలో చేరారన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి మాజీ ఎమ్మెల్యే సారదంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని సంక్షేమ పథకాలు వారి అనుచరులకే అందుతున్నాయని అక్రమ మైనింగ్ వ్యాపారాలు , భూ కబ్జాలతో ప్రజలను భయపెడుతున్నారని అందుకే యువత తెలుగుదేశం పార్టీకి మద్దతు తెల్పుతుందని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకొని కుంటుపడిన అభివృద్ధిని మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని తెలిపారు.

## కులగణన సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలి.. ఎంపీడీవో గోపికృష్ణ

**పాములపాడు ,మేజర్స్ న్యూస్ :** కులగణన సర్వే సున్నితమైన అంశమని, అన్ని జాగ్రత్తలు తీసుకుని కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలని ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. బుధవారం నాడు జూటూరు-2 కృష్ణరావుపేట గ్రామంలో వాలంటరీలు నిర్వహిస్తున్న కులగనన సర్వేని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కులగణన-2023 సర్వే కులగణనలో ఆర్థిక, సామాజిక, విద్య, జీవనోపాధి, జనాభా సమతుల్యతలపై సర్వే చేస్తున్నామని తెలిపారు. కులగణనకోసం ఇంటింటికి వెళ్లిన సమయంలో బయోమెట్రిక్, ఐరిస్, ఈకేవైసీ వంటివి చేస్తారని తెలిపారు మొబైల్ ఫోన్ యాప్ లో పూర్తి డేటా నమోదు చేస్తారని తెలిపారు సర్వేలో తదితరులు పాల్గొన్నారు.



# ఆడుదాం..ఆంధ్ర వాలీబాల్ విజేత నేరేడుచెర్ల జట్టు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపిడిఓ, అధికారులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులలో దాగి ఉన్న క్రీడాస్ఫూర్తిని వెలికి తీసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామానికి చెందిన పురుషుల విభాగంలో వాలీబాల్ పోటీ నందు డోన్ జట్టుతో తలపడగా నేరేడుచెర్ల జట్టు విజేతగా నిలిచింది. దీంతో రూ.35వేలు నగదు బహుమతిని అందుకొని, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. అదే విధంగా మహిళల వాలీబాల్ పోటీల్లో డోన్ జట్టుతో మండల పరిధిలోని జలదుర్గం-2 జట్టుకు జరిగిన పోటీలో జలదుర్గం-2 మహిళ జట్టు గెలిచి రన్నర్‌గా నిలిచి, రూ.15వేలు నగదు బహుమతి గెలుచుకున్నారు. అనంతరం ఈ రెండు జట్లలోని క్రీడాకారులను ఎంపిడిఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్‌డి బాలకృష్ణలు అభినందించారు.

# ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

**బాలికలు, యువతుల కోసం నంద్యాల మిషన్ పింక్ హెల్త్ వాట్సాప్ హెల్ప్ లైన్ ను ఆవిష్కరించిన శిల్పా నాగిని రెడ్డి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో జాతీయ బాలిక దినోత్సవంఘనంగా నిర్వహించారు.మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షకార్యదర్శులు డాక్టర్‌నెరవాటి అరుణకుమారి,డాక్టర్ సుసుమ, డాక్టర్ శైలజల నిర్వహణలో జరిగిన ఈకార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ చైర్ పర్సన్ నాగిని రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ జి రవికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మహిళా సాధికారతపై నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్‌హెల్త్ విభాగం రూపొందించిన వీడియోను డాక్టర్ రవి కృష్ణ ఆవిష్కరించారు.బాలికలు, యువతుల కోసం నంద్యాల మిషన్ పింక్ హెల్త్ వాట్సాప్ హెల్ప్ లైన్‌నునాగినిరెడ్డిఆవిష్కరించారు.డాక్టర్‌అరుణకుమారి మాట్లాడుతూ వాట్సాప్ హెల్ప్ లైన్ ద్వారా బాలికలు,యువతుల ఆరోగ్య సంబంధ సందేహాలకు మహిళా వైద్యులు సమాధానాలు ఇస్తారని తెలిపారు. నాగిని రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఈరోజు ముందంజ వేస్తున్నారని ,విజయాలు సాధిస్తున్నారని,తల్లిదండ్రులు బాలికలను వారు ఎంచుకున్న రంగంలో రాణించేలాగా ప్రోత్సహించాలని కోరారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దేశంలో వైద్య, ఆరోగ్య రంగంలో వివిధ స్పెషాలిటీ మహిళా వైద్యుల ప్రాధాన్యత పెరుగుతున్నదని, నంద్యాల ఐఎంఏమహిళా వైద్య విభాగం, మిషన్ పింక్ హెల్త్ విభాగం సామాజిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్నారని అభినందించారు.ఈకార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మధుసూదన్ రెడ్డి ,డాక్టర్ నాగమణి ,డాక్టర్ నర్మద ,డాక్టర్ కల్పన, డాక్టర్ సరిత, డాక్టర్ సునీత, డాక్టర్ మాధవి,డాక్టర్ లలిత, డాక్టర్ తనూజ, పలువురు మహిళా వైద్యులు, ఆసుపత్రుల మహిళా ఉద్యోగులు, పాఠశాల బాలికలు పాల్గొన్నారు.




జాతీయ బాలికా దినోత్సవం లో ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ వాట్సప్ హెల్ప్ లైన్ ఆవిష్కరణ

# ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ , ఎమ్మెల్యే, మాజీ విప్

**తాలూకా స్థాయి పోటీలు ప్రారంభం**



క్రీడా ప్రాంగణానికి వస్తున్న ఎంపీ ఎమ్మెల్యే మాజీ విప్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** క్రీడల పట్ల ఏ ప్రభుత్వము ఇంత శ్రద్ధ తీసుకోలేదని శాసనసభ్యులు గంగుల నాని అన్నారు. బుధవారం వైపిపిఎం క్రీడా ప్రాంగణంలో తాలూకాస్థాయి క్రీడా పోటీలను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శాసనసభ్యులు గంగుల నాని, రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గంగుల నాని మాట్లాడుతూ తాలూకా స్థాయి పోటీలను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏ ప్రభుత్వం ఇంత శ్రద్ధ తీసుకోలేదన్నారు. విద్యార్థులలో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఆడదాం ఆంధ్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈనెల 30న నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఫైనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆర్డీవోశ్రీనివాసులు,తహసిల్దార్‌లు హరినాధరావు, రవీంద్ర ప్రసాద్, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, పీఈటీలు, క్రీడాకారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విజ్ఞాన యాత్ర

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు విద్యా విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం పొద్దుటూరు పట్టణ సమీపంలోని శ్రీ రాజరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒకేషనల్ ఇండస్ట్రియల్ టూర్ లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు శ్రీ రాజరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒకేషనల్ ఇండస్ట్రియల్ కు వెళ్లి వృత్యంతర శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలయ్య ,మధురిమ షఫీ రూన్ ,నరేష్ మల్లికార్జున,భవాని తదితరులు విద్యార్థులతో కలిసి పాల్గొనడం జరిగింది.



ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒకేషనల్ ఇండస్ట్రియల్ టూర్ లో విద్యార్థులు

# గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

**– ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ**

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ వేడుకలకు ముఖ్య అతిథులు, పాఠశాల విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అద నపు ఎస్పీ చంద్రబాబు, ఆర్ఐలు సుధాకర్, మంజునాథ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

# ఆడుదాం ఆంధ్రలో మోడల్ స్కూల్ విద్యార్థినీల ప్రతిభ

**గడివేముల, మేజర్‌న్యూస్ :** గ్రామ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీల్లో గడివేముల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినిలు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. పాణ్యం నియోజకవర్గ స్థాయిలో గడివేముల మోడల్ స్కూల్ విద్యార్థినిలు కల్లూరు మండల విద్యార్థినిలతో కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడి గెలుపొందారు. పాఠశాల విద్యార్థినిలను ప్రిన్సిపల్ శైలజ, పిఈటి రవీంద్రనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలజ మాట్లాడుతూ విద్యార్థినిలు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో గెలుపొందారని జిల్లా స్థాయికి, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# గ్రామాల అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యం..మాజీ ఎమ్మెల్యే బీవీ


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వంతో సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మ ఒడల కేంద్రమైన గోనెగండ్లలోని అచ్చుకట్లవీది, ఎస్సీ కాలనీ, సంతమార్కెట్, దరగల వీది తదితర ప్రాంతాలలో బీవీ పర్యటించారు. గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు, నిరుద్యోగులకు, యువతకు మహిళలకు చేసే అభివృద్ధి పనులను గురించి వారికి వివరించారు. గ్రామ ప్రదాన కూడళ్లలో ప్రజల నుద్దేశించి బీవీ ప్రసంగిస్తూ సీఎం జగన్ పాలనలో గ్రామాలలో అభివృద్ధి శూన్యమైందన్నారు. వ ఒడ లంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అయినప్పటికి సమస్యను పరిష్కరించేందుకు అధికార పార్టీ నాయకులు ముందుకు రాకపోవడం దారుణం అన్నారు. రైతులకు వైసీపీ పాలనలో తీవ్రఅన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోతాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గాను టీడీపీ హయాంలో ఎంవీఎస్ స్కీం ప్రకటించి రూ. 13.50 కోట్ల నిధులకు కూడా విడుదల చేశాం అయితే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. జగన్ ప్రభుత్వం నిలిచిన పనులను ఇప్పటికైన చేపట్టి మండలంలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య ను తీర్చాలని డిమాండ్‌చేశారు. టీడీపీ మండల కన్వీనర్ నజీరాసాహెబ్, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచ్ రంగముని, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రంగస్వామినా యుడు, రాంపురం రఫీక్, రమేష్నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇచ్చేది గోరంత.. దోచేది కొండంత–మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నా అక్కా చెల్లెమ్మలు అంటూనే గోరంత సాయం చేసి కొండంత వారి నుండి దోచేస్తున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బుధవారంనాడు బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఎర్రగుడి, గోవిందిన్నె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలను తీసుకురావడమేకాకుండా వాటి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని నాడు రాష్ట్రంలో 1కోటి14లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే నేడు 79లక్షలకే కుదించారని ఈ రకంగా 35లక్షల మందికి ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని మూడు రెట్లు పెంచి నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆటడమేకాక మహిళల మాంగ్యాలు మంటగలుపుతున్నార న్నారు. 57 నెలల పాలనలో తినే ప్రతి వస్తువు ధర పెంచి ఒక్కో కుటుంబంపై దాదాపుగా 3లక్షల భారం మోపారన్నారు. ఎర్రగుడి , గోవిందిన్నె గ్రామాల్లో 2014 నుంచి 2019 వరకు లక్షల రూపాయలు వెచ్చించి రైతు రుణమాఫీ చేయడమేకాక గ్రామాల అభివృద్ధికి కూడా తాను కృషి చేశానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చంద్రబాబు అందించబోయే సూపర్‌సిక్స్ పథకాల ను తెలిపే కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి సర్పంచ్ దోనపాటి వరలక్ష్మీ, వైకాపా నాయకులు దోనపాటి భాస్కర్ రెడ్డి, అంబాల రామకృష్ణా రెడ్డి, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే బీసీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

# తెలుగుదేశం ప్రభుత్వం వస్తే సమస్యలు పరిష్కరిస్తాం: టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని 5వవార్డులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కరేపాకు వీధి, చిత్తారివీధి ఈద్గా, సుబ్రమణ్య మఠం ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం సూపర్6 పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం వస్తే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిబాలు, సురేష్, ఇంద్ర, సుశీలమ్మ, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, లలితమ్మ, నరేష్, అనిల్, నాగరాజు, హిదాయత్, నరేష్, వసుంధర, కార్తీక్, షఫిఉల్లా, సికిందర్, సమీర్, అంజి, నాగరాజు పాల్గొన్నారు.

# వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**– ఎమ్మెల్సీలు బీటీనాయుడు, కంచర్ల శ్రీకాంత్**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీలు బీటీనాయుడు, కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, హిందూపురం పరిధిలోని మొత్తం 36అసెంబ్లీ నియోజకవర్గాలకు చెంది న తెలుగుదేశంపార్టీ నాయకులు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదే శం పార్టీ నాయకులు సాంకేతికతను అలవ ర్చుకోవాలన్నారు. ఓటర్ వెరిఫికేషన్, బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ, కుటుంబ సాధికార సారథుల నియామకం చేపట్టాలన్నా రు. దొంగ ఓట్లను గుర్తించాలన్నారు. బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. ప్రతి 120ఓటర్లకు ఒకరిని గృహసారధిగా నియ మించుకొని వారిని అనునిత్యం కలవాల న్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, నాగేంద్రకుమార్, అశోక్, అంబటి లక్ష్మినారాయణ, సత్రం రామక్రిష్ణుడు, జేమ్స్, ముంతాజ్, తిలక్ పాల్గొన్నారు.




# బ్యానర్ల తొలగింపు పై నిరసన

**నిరసన వ్యక్తం చేసిన ప్రజా సంఘాలు**

**పాములపాడు ,మేజర్ న్యూస్ :** వివిధ పార్టీ నాయకులు ప్రజాసంఘాల నాయకులు ప్రజలు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఫ్లెక్సీలు తొలగించడం పై అభ్యంతరాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఫ్లెక్సీలను సమాచారం ఇవ్వకుండా తొలగించడం పై తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం సభ్యులు రాయపాటి మురళీమోహన్, రామ్మోహన్, సురేష్, బీఎస్పీ స్వాములు, మాల మహానాడు అంకన్న, షేక్షావలి, సేవా భారతి అధ్యక్షుడు షర్బుద్దీన్ అలీ, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



# క్యాట్ ఫలితాలలో శ్రీ చైతన్య ఎన్3 బ్రాంచ్ విద్యార్థుల ప్రభంజనం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** శ్రీ చైతన్య పాఠశాల ఎన్3 బ్రాంచ్ లో జాతీయస్థాయిలో నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ లెవెల్ 2 పరీక్షలలో 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సి5. జి. యశస్వినిసి. 3,ఎం. కళ్యాణి. సి2, పి. రంగ కిషోర్ ,ఈ ముగ్గురు విద్యార్థులు పరీక్షలలో విజయం సాధించి నగదు బహుమతిని గెలుచుకోవడం జరిగింది. అలాగే ఈ పరీక్షలలో 33 మంది విద్యార్థులకు మెడల్స్ ను మరియు 37 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు ను గెలుచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల నందు ప్రిన్సిపల్ విజేతలుగా గెలుపొందిన వారికి అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో ఎలాంటి ఎన్నో పరీక్షలలో విజయాలను సాధించాలని విద్యార్థి జీవిత గమనానికి క్రమశిక్షణ ఎంతగానో తోడ్పడుతుందని క్రమశిక్షణతో ముందుముందుఎన్నో విజయాలను అదిరోహించవచ్చని మాట్లాడడం జరిగింది. తర్వాత డీన్ శాలుమియ మాట్లాడుతూ ఈ క్యాట్ పరీక్షలలో మా విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని, అలాగే ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రణాళికలు కలిగి ఉంటే ఎన్నో విజయవకాశాలను సాధించుకోవచ్చని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో నాగార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆసరా ద్వారా జీవనోపాధి వృద్ధి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ ఆసరా పథకం ద్వారా జీవనోపాధిని వృద్ధి చేయడమే కౌన్సిలర్లు గురుమూర్తి, వరప్రసాద్ రెడ్డిలు అన్నారు. బుధవారం ఎంపీడీవో సచివాలయ కార్యాలయ సచివాలయము, పెద్ద చింతకుంట్ల సచివాలయ పరిధిలోని పొదుపు సంఘాలకు విడత వైయస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వం అని, మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు అనేక పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మహిళల రక్షణ కొరకు అనేక చట్టాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని, కరోనా కష్టకాల సమయంలో కొనసాగించిన ఘనత మన ముఖ్యమంత్రి దే అన్నారు. వైయస్సార్ ఆసరా నాలుగో విడత ద్వారా ఎంపీడీవోకార్యాలయం వద్ద ఉన్న సచివాలయంకు సంబంధించి 61 పొదుగు సంఘాలకు 39.64 లక్షలు, పెద్ద చింతకుంట్ల సచివాలయానికి సంబంధించి 73 సంఘాలకు 39.17 లక్షల రూపాయల వడ్డీ సొమ్మును పొదుపు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం పొదుపు మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మెప్మా సిఎంఎం శోభ, సి ఓ లు వెంకటసుబ్బయ్య, చంద్ర విద్యాసాగర్, సమాఖ్య ఆర్పీలు, ఓబీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి వైయస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

# మండల అభివృద్దే ధ్యేయం..ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డి



**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** క్రిష్ణగిరి మండల అభివృద్ధే ధ్యేయంగా తాను నిత్యం శ్రమిస్తున్నానని ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ,మండల అభివృద్ధిలో భాగంగా ఎంపిటీసీ సభ్యులు,సర్పంచులు,తనతో సహకరించాల్సిందిగా కోరారు. తద్వారా గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొనే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్.రామస్వామి,మండల ఉపాధ్యాక్షురాలు సుశీల,పి. ఆర్. ఏ. ఈ అబ్దుల్ వహీద్ సాహెబ్,ఏఓ వెంకటేశ్వర్లు,ఎంఈఓ వై. సునంద,కో ఆప్షన్ సభ్యులు నక్క శాలు,ఇంకా పలువురు అధికారులు ఎంపిటీసీ సభ్యులు,సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ అక్కా,చెల్లెమ్మల ఆశయాలను నెరవేర్చారు

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాడు చేపట్టిన పాదయాత్రలో రాష్ట్రంలోని పేద అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన ప్రతి హామీలను తూచా తప్పకుండా నెరవేర్చారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ఆసరా 4వ విడతలో రూ. 5కోట్ల64లక్షల 41వేలు నగదును వారి ఖాతాల్లో జమచేశారని తెలిపారు. ఈసందర్భంగా ఆసరా నాలుగో విడత మెగా చెక్కును లబ్ధిదారులైన మహిళలకు ఎమ్మెల్యే శిల్పా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ప్రహ్లాదరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని పేదింటి అక్కా చెల్లెమ్మ కష్టాలను, కన్నీళ్ళను ప్రత్యక్షంగా చూసి వినివారికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మహిళల నమ్మకాన్ని చూరగొన్నారన్నారు. నవరత్నాలలో భాగంగా నేడు అమలు చేస్తున్న ప్రతి పథకంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, శశికళరెడ్డి, శకుంతలమ్మ, భారతి, మహేశ్వరమ్మ, సర్పంచ్‌లు రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

## – నగర మేయర్ బి.వై.రామయ్యకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ వద్ద ఉన్న శ్రీరేణుక ఎలమ్మ దేవాలయం పక్కన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి మురికినీరు రాకుండా చేయాలని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం నగర మేయర్ బి.వై.రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కల్వర్టును వెడల్పు చేస్తే వర్షం పడితే మురికినీరు ఆలయంలోకి రాకుండా ఉంటుందన్నారు. ఇందుకు మేయర్ వెంటనే స్పందిస్తూ డీఈ రాజశేఖర్‌కు ఫోన్ చేసి కల్వర్టకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమటీ అధ్యక్షుడు దాదేపోగు అయ్యన్న, ఉపాధ్యక్షుడు చంద్ర, కమిటీ సభ్యుల రాజా, అజయ్‌బాబు, శివశంకర్, సుధాకరయ్యలు పాల్గొన్నారు.

# కబడ్డీ రన్నర్‌గా కల్లూరు మండల జట్టు


కబడ్డీ జట్టును అభినందిస్తున్న ఎంపీడీవో

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కల్లూరు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో కల్లూరు మండలం జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ మేరకు బుధవారం మండ జట్టును ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జివి.రమణమూర్తి, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో కల్లూరు మండల జట్టు రన్నర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, శ్రీనివాసులు, బుక్‌కీపర్ మహాలక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యులు అహ్మద్‌బాష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉర్దూ పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో జగనన్న ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమాతె ఇస్లామి హింద్ నంద్యాల అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ మరియు ప్రముఖ న్యాయవాది నూర్ అహమ్మద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక ప్రణాళికతో మైనార్టి, ముస్లీం పేద విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు బైజూస్ కంటెంట్‌తో రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి చదువుతున్న ముస్లీం, మైనార్టి విద్యార్థులకు ఉచితంగా రూ.15 వేలు విలువ చేసే సామ్‌సంగ్ ట్యాబ్‌లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ తేజ, పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ నజీర్, ఖలీముల్లా, షబానా పర్వీన్ పాల్గొన్నారు.

## రాజకీయ రుద్రుడు

# ఇస్తేవరం.. పెడితేశాపం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయంగా ఎదిగారు. 1985లో జరిగిన మూడంచెల స్థానికసంస్థల ఎన్నికల్లో కర్నూలు మండల పరిషత్ చైర్మన్‌గా గెలుపొంది రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా రాణించారు. 40 ఏల్ల సుదీర్ఘరాజకీయాల్లో ఆయనను నమ్ముకున్న నాయకులకు,కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి వారికి అండగా నిలువడంలో ఆయనకు ఆయనేసాటి అందువల్లనే ఇక్కడి ప్రజల గుండెల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు. నిస్వార్థపరుడు, మొండి వాడు,పట్టుదలగల నాయకుడు,అనుకుంటే ఏదైనా సాదించితీరుతాడన్న ఈ రాజకీయ రుద్రుడు ఆడే రాజకీయ చదరంగంలో ఎవరికైనా ఇస్తే వరం పెడితే శాపమే. ఎన్నోఏల్లుగా ప్రజాసేవకోసం తనను నమ్ముకున్నవారికోసం నిత్యం నిస్వార్ధ రాజకీయాలను నడుపుతున్న ఎదురూరు విష్ణును ఎమ్మెల్యేగా,మంత్రిగా చూడాలన్నది ఇక్కడి ప్రజల ఆకాంక్ష. ఈయన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని కొన్ని రాజకీయ దుష్టశక్తులు ఎన్ని అడ్డంకులను శృష్టించినా విష్ణు మొక్కవోని ధైర్యంతో రాజకీయాల్లో డీ అంటే డీ అనే తలపడ్డారు. 1994 ఎన్నికల్లో దివంగత శిఖామణికి కాంగ్రెస్ పార్టీ తరుపున కోడుమూరు టికెట్టు ఇప్పించి గెలిపించారు. ఉమ్మడి రాష్ట్రంలోని అలంపూర్ నియోజకవర్గం నుండి 1994లో విష్ణు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీచేసి 900 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం స్వర్గీయ కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై హైదరాబాదులో పెద్దెత్తున దర్నా నిర్వహించారు. 1995లో స్వర్గీయ రామారావు పిలుపుమేరకు తిరిగి టిడిపిలో చేరి బంగి అనంతయ్యను మేయర్‌గా గెలిపించారు. తర్వాత టిడిపిలో ఏర్పడిన రాజకీయ సంక్షోబం కారణంగా లక్ష్మీపార్వతి టిడిపిలో చేరి 1996 కర్నూలు ఎంపిగా పోటీచేశారు. తిరిగి కంగ్రెస్‌పార్టీలో చేరి స్వర్గీయ వైయస్ రాజశేకర్‌రెడ్డి మద్దతుదారుడిగా ఉన్న సమయంలో వైయస్ కర్నూలు టికెట్ నిరాకరిస్తే 2004 ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా ఫ్యాన్ గుర్తుతో పోటీచేయగా దాదాపుగా 31 వేలఓట్లు సాదించుకున్నారు.. అనంతరం ప్రజారాజ్యంపార్టిలోచేరి 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యంపార్టినుండి పాణ్యం ఎమ్మెల్యేగా పోటీ చేయగా 29 వేల ఓట్లు పడ్డాయి. అదేవిదంగా తన అనుచరుడైన కరుణాకర్‌ను కోడుమూరు ప్రజారాజ్యం అభ్యర్థిగా రంగంలోకి దింపగా విష్ణు అండవల్లనే కరుణాకర్ కు 29 వేల ఓట్లు పోలయ్యాయి. అటుపిమ్మట వైసిపిలో చేరి 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మణిగాందిని గెలిపించారు. అనంతరం టిడిపిలోచేరి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా మల్లెల రాజశేఖర్ గెలుపుకు చక్రంతిప్పారు. స్థానిక ఎన్నికల్లో తన కుమారుడైన రాజవర్ధన్‌రెడ్డిని కర్నూలు టిడిపి ఎంపిపిగా గెలిపించుకొన్నారు. కోడుమూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ బాద్యతలు చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కర్నూలు,కోడుమూరు,పాణ్యం నియోజకవర్గాల్లోని రాజకీయాలను శాసిస్తూ రాజకీయ రుద్రుడుగా రాణిస్తున్నారు. ప్రతి ఎన్నిల్లోనూ పార్టీకి సేవలందించి తన సత్తాను చాటుకున్నారు. అయితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యస్సి నియోజకవర్గమైన కోడుమూరులో తన అనుచరులకు టికెట్ దక్కించుకోవడానికి ఎదురూరు విష్ణవర్ధన్‌రెడ్డి రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నారు. ఇక్కడి అభ్యర్థిని గెలిపించుకొని ఎలాగైనా తెలుగుదేశంపార్టి ఖాతాలో పడేవిదంగా విష్ణు పట్టు బిగిస్తున్నారు. పార్టినేతలు,కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూనే పార్టి హైకమాండ్‌తో తన అనుచరులకే టికెట్ కావాలని పట్టవదలని విక్రమార్కుడిలా సర్వశక్తులను ఒడ్డుతున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో దాదాపుగా 30 వేల ఓట్లు ఎదురూరు విష్ణు ఖాతాలో ఉన్నాయంటే ఇక్కడి ప్రజల్లో ఆయనకుగల స్థానం ఏపాటిదో యిట్టే అర్థమవుతోంది. తనను నమ్ముకున్న వారికోసం నిరంతరం పనిచేసే విష్ణు పిలుపుతోనే వేలాదిమంది అభిమానులు,కార్యకర్తలు తరలివచ్చి నారా లోకేష్ యువగళం యాత్రను నియోజకవర్గంలో విజయవంతంగా జయప్రదం చేశారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుతో తనకున్న సంబందాలతో కోడుమూరు టికెట్‌పై తన అనుచరులైన బొగ్గుల దస్తగిరి,జయ్యన్నలలో ఒకరికి ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నారు. ఇప్పటికే విష్ణన్న వదిలిన చక్రంగా బొగ్గుల దస్తగిరి నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టి నాయకులను,కార్యకర్తలను కలుసుకొని వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను వివరిస్తూ తెలుగుదేశంపార్టి అదికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు. విష్ణవర్ధన్‌రెడ్డి ప్రతిపక్షంలోకూడా 38 మంది ప్రజాప్రతినిదులను గెలిపించుకున్నార ంటే రాజకీయంగా ఆయనకున్న భలం ఏపాటిదో తెలుస్థోంది.ఇక్కడ జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఎదురూరు విష్ణు ప్రభావం తప్పకుండా కనిపిస్థోంది.

రానున్న ఎన్నికల్లో టిడిపి అధిష్టానంకూడ విష్ణు సూచించిన వారికే టికెట్ ఇస్తుందని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. 2024 ఎన్నికల్లోనూ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థిని ఎంపిక చేయడంలో విష్ణువర్ధన్‌రెడ్డి పాత్రే కీలకం కానుంది.

## క్రీడాకారులు గెలుపోటములు

# సమానంగా స్వీకరించాలి : ఎమ్మెల్యే

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. పత్తికొండ నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులందరూ మానసిక ఉల్లాసాంతో ఆడి గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, నియోజకవర్గ జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, ఎంపిడిఓ కవితారెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు


క్రీడాకారులతో ఎమ్మెల్యే

మస్తాన్ వలి, రమేష్, వైఎస్సార్సిపి నాయకులు సోమశేఖర్, బనగాని శ్రీనివాసులు, పెద్దహూల్తి నాగరాజు, నెట్టేకల్లు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంవో నుండి ఎమ్మెల్యేకు పిలుపు..!

(మొదటిపేజీ తరువాయి)

మార్చాలని ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం మాచాని వెంకటేష్‌ను అభ్యర్థిగా నిలిపితే గెలుస్తాడా..? ఆయనకు పార్టీ క్యాడర్ సంపూర్ణంగా సహకరిస్తుందా..? అనే విషయమై సర్వే చేయించిందని తెలుస్తోంది. ఈ సర్వేలో మాచాని వెంకటేష్‌కు ప్రతికూల పవనాలు వీస్తున్నట్లు తేలడంతో వైసీపీ అధిష్టానం పునారాలోచనలో పడ్డట్టు సమాచారం. అందులో భాగంగానే ఈనెల 7వ తేదిన వైసీపీ రాయలసీమ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి హుటాహుటిన ఎమ్మిగనూరుకు వచ్చి రాత్రి పూట ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిశాడు. అభ్యర్థి మార్పుపై పునరాలోచించాలని, మాజీ ఎంపీ బుట్టా రేణుకా అయితే గెలిచే అవకాశం ఉన్నందున మనస్సు మార్చుకోవాలని ఎమ్మెల్యేను కోరార ట. అయితే ఇందుకు ససేమిరా అన్న ఎమ్మెల్యే కొత్త అభ్యర్థి మాచాని వెంకటేష్‌ను ఖచ్చితంగా గెలిపించి తీరుతానని, అభ్యర్థి మార్పుకు తాను అంగీకరించనని ఖరాఖండిగా చెప్పిపంపారు. పార్టీ పెద్దలు, దూతల మాటలకు ఎమ్మెల్యే తలొగ్గకపోవడంతో నేరుగా పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డినే రంగంలోకి దిగారు. మంగళవారం రాత్రి సీఎంవో నుండి ఎమ్మెల్యేకు ఫోన్ వచ్చింది. బుధవారం సాయంత్రంలోపు సీఎంవోకు అందుబాటులో ఉండాలని కబురుపెట్టారు. దీంతో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి బుధవారం ఉదయం తన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డిని వెంటబెట్టుకొని తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బుధవారం సాయంత్రం తిరుపతిలో జరిగే ‘ఇండియా టుడే’ ఆధ్వర్యంలో జరిగే సమ్మెట్‌లో పాల్గొనేందుకు వెళుతుండటంతో గురువారం ఉదయం లేదా సాయంత్రం ఎమ్మెల్యే అధినేతను కలిసే అవకాశం ఉంది.

**బుట్టా రేణుకా వైపే అధిష్టానం మొగ్గు :**

ఎమ్మిగనూరు అభ్యర్థిని మార్చే యోచనలో వైసీపీ అధిష్టానం ఉండటంతో మళ్లీ మాజీ ఎంపి బుట్టా రేణుకా పేరు తెరపైకి వచ్చింది. మాచాని వెంకటేష్ అభ్యర్థిత్వంపై అయిష్టంగా ఉన్న పార్టీ క్యాడర్ బుట్టా రేణుకా అయితే తమకు అభ్యంతరం లేదని పార్టీ పెద్దలకు, సర్వే టీమ్‌ల ముందు చెప్పేశారు. దీంతో ప్రస్తుతం అధిష్టానం బుట్టా రేణుకా వైపే మొగ్గు చూపుతూ ఎమ్మిగనూరు బరిలో నిలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేను బుజ్జగించి బుట్టా రేణుకాను అభ్యర్థిగా ఒప్పించేందుకే సిద్దమైనట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అందులో భాగంగానే సీఎంవోకు రావాలని ఎమ్మెల్యేకు కబురు పెట్టినట్లు సమాచారం. అభ్యర్థుల మార్పు విషయంలో రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యేకు కూడా ఇవ్వని గౌరవనాన్ని చెన్నకేశవరెడ్డికి ముఖ్యమంత్రి ఇస్తుండటంతో ఎమ్మెల్యే సైతం బుట్టా రేణుకా పేరునే అంగీకరించేందుకు సిద్దమై సీఎంవోకు వెళుతున్నట్లు ముఖ్యనాయకుల ద్వారా తెలుస్తోంది. అధినేత అభ్యర్థనను ఎమ్మెల్యే అంగీకరిస్తారా..? లేదా తిరస్కరిస్తారా..? అనే విషయం గురువారం సాయంత్రంలోపు తేలిపోనుంది.

**మార్పు అనివార్యమైతే ఎమ్మెల్యే మదిలో మరికొన్ని పేర్లు :**

మాచాని వెంకటేష్‌ను మార్చడం అనివార్యమై, తెరపైకి వచ్చే బుట్టా రేణుకా పేరును అంగీకరించకపోతే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఎవరి పేరును సూచిస్తారోనన్న ఉత్కంఠత కూడా వైసీపీ శ్రేణుల్లో నెలకొంది. ముందుగా తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి పేరును సూచించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఒక వేళ బీసీ అభ్యర్థి, అందులోనూ కుర్ణి సామాజికవర్గానికి చెందిన వారి పేరునే సూచించాలని వైఎస్.జగన్ పట్టుబడితే ఎమ్మెల్యే మదిలో కొన్ని పేర్లు ఉన్నట్లు సమాచారం. కుర్ణి సామాజికవర్గంలో ప్రస్తుతం పార్టీలో పేరున్న నాయకుల్లో మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ రఘు, మాజీ మున్సిపల్ చైర్మెన్ బుట్టా రంగయ్యలు ఉన్నారు. ఇక ఎంజీ బ్రదర్స్ కుటుంబాలతో కూడా ఎమ్మెల్యేకు మంచి సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆ కుటుంబంలో ఎవరి పేరునైనా తెరపైకి తెచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని క్యాడర్ అంటోంది. ఎమ్మెల్యే మదిలో ఎవరున్నారన్న విషయం ఆయనకు తప్ప మరెవరికీ తెలిసే అవకాశం లేకపోవడంతో ఊహించని వ్యక్తుల పేర్లు కూడా ఆయన పరిశీలినలో ఉండే అవకాశం లేకపోలేదు.

**టీడీపీలోనూ వైసీపీ అభ్యర్థి మార్పుపై టెన్షన్ః–**

వైసీపీ అభ్యర్థిని మారుస్తారని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష టీడీపీ నాయకుల్లో కూడా టెన్షన్ నెలకొంది. వైసీపీ అభ్యర్థిగా మాచాని వెంకటేష్ పేరును ప్రకటించినప్పటి నుండి టీడీపీ శ్రేణులు ఆనందంతో గంతులే స్తున్నారు. ఇక టీడీపీ అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి విజయం నల్లేరుపై నడకేనని, కేవలం భారీ మేజార్టీ కోసం మాత్రమే తాము ప్రయత్నమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వైసీపీలో అభ్యర్థిని మారుస్తున్నారన్న సంకేతాలు వెలువడటంతో ఆ పార్టీ శ్రేణులకు మార్పు అంశం మింగుడుపడటంలేదు. బుట్టా రేణుకాకు వైసీపీ సీటు కేటాయిస్తే తీవ్రంగా శ్రమించినా గెలుస్తామా? లేదా? అన్న అనుమానం టీడీపీలో ఉంది. దీంతో వైసీపీలో జరుగుతున్న పరిణామాలను టీడీపీ ఆసక్తిగా గమనిస్తోంది.

# నియోజకవర్గానికి పేరు తీసుకురండి

## – ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** క్రీడలు బాగా ఆడి క్రీడాకారులు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకరావాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్, జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, ఓర్వకల్లు గ్రామ సర్పంచ్ నాగేశ్వరమ్మ, వివిధ గ్రామాల సర్పచులు, పీఈటీలు పాల్గొన్నారు.

# ఉపాధి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** ఉపాధి పెండింగ్ బిల్లును విడుదల చేసి కరువు సహాయక చర్యలు చేపట్టి వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివనాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశాఉ. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు వేసిన పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించినప్పటికీ ఇంతవరకు సహాయక చర్యలు చేపట్టలేదని, వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటను ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాష, మల్లేష్, శేషయ్య, నాగరాజు, మాసంబాష పాల్గొన్నారు.

# నేడు జొన్నగిరిలో జయహో బీసీ



కేఈ శ్యామ్‌బాబు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండలంలోని జొన్నగిరి గ్రామంలో గురువారం సాయంత్రం జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర తిరుపాల్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యామ్‌బాబు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కావునా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### నాటుసారా నిర్మూలనకు

# పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

## – అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** నాటుసారా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు ఆదేశించారు. బుధవారం నంద్యాల జిల్లా సెబ్ ఇన్‌స్పెక్టర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సెబ్ ఇన్‌సెక్టర్‌లతో మాట్లాడుతూ జిల్లాలో మీ స్టేషన్ పరిధులలో కొత్తగా నాటుసారా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి పూర్తిగా నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. అందుకొరకు అవగాహన కార్యక్రమాలను, పరివర్తన 2.0 కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకం దారులపై ప్రత్యేక నిఘా ఉంచి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేందుకు కృషి చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే పిడి యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి





కలెక్టర్, ఎస్పీలకు పూలబొకే అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని వైసీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నిలకు సంబంధించిన పలు విషయాలను వారితో చర్చించారు. నియోజకవర్గ కేందారల్లో అవసరమైన పోలీసు బందోబస్తుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్, ఎస్పీ. కోరినట్లు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ తెలిపారు.

# నంద్యాల అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి

**నంద్యాలకల్చరల్, మేజర్‌న్యూస్:** నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతామని, శ్రమిస్తామని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిరెడ్డి అన్నారు. బుధవారం 42వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20లక్షల నిధులను కేటాయించడం జరిగింది. ఇందులో భాగంగా రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కౌన్సిలర్ శిరీష, వార్డు ఇన్‌చార్జి కిరణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మాబున్నీసా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. నంద్యాల నియోజకవర్గంలో రూ.14కోట్ల40లక్షల నిధులను కేటాయించి అభివృద్ధిని చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బీపీ మధుసూధన్‌రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగన్న, కౌన్సిలర్స్ షాదిక్‌బాషా, లక్ష్మీనారాయణ, మేదర లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన ఆలూరు వైసిపి ఇంఛార్జ్ విరుపాక్షి





జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలూరు వైసీపీ ఇంచ్చార్జ్ విరుపాక్షి

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఆలూరు తాలూక వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుసినే విరుపాక్షి బుధవారం జిల్లా కలెక్టర్ సృజన,ఎస్పీ కృష్ణకాంత్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వేసవి కాలం దగ్గరపడుతుందని అందునా ఆలూరు నియోజకవర్గానికి వేసవిలో తాగునీటి సమస్య రాకుండా నిధులు కేటాయించాలని సమ్మర్ స్టోరేజ్ లలో నీటిని నిల్వ చేసేలా అధికారులుకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. అలాగే జిల్లాలో శాంతి భద్రత్తలు కట్టుదిట్టంగా అమలు చేయడంలో జిల్లా ఎస్పీ కృషి ఎనలేనిదన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో చెక్ పోస్టులలో కూడా భద్రత పెంచాలని ఇటీవల పలు పట్టణాలలో అల్లరిమూకలు చిల్లర దొంగతనాలు చేస్తూ ప్రజలను ఆందోళనలకు గురిచేస్తున్నారని కావున రాత్రి పూట గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీని కోరారు.అలాగే ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నియమించారని తనకు ప్రచారం నిమిత్తం రక్షణ సిబ్బందిని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగప్ప,లోకనాథ్, సోదరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో విరుపాక్షి గెలుపుకు కృషి చేస్తాం



**చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** వచ్చే ఎన్నికల్లో ఆలూరు వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బుసినే విరుపాక్షి గెలుపుకు శాయశక్తులా కృషి చేస్తామని హాలహర్వి మండలం బాపురంగ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గడ్డం జేసిబి నాగరాజు,కృష్ణమూర్తి,శివరాజ్ గౌడ్ లు అన్నారు.ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రమైన చిప్పగిరిలో వారు ఆలూరు ఇంచార్జ్ విరుపాక్షి ని కలవడానికి నాలుగు వాహనాలలో కార్యకర్తలు తో కలిసి తరలివచ్చారు.అనంతరం వారు వైసీపీ ఇంచార్జ్ విరుపాక్షికి శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు.ముఖ్యమంత్రి జగనన్న కార్యకర్తల కష్టాలను చూసి ప్రజా నాయకుడైన విరుపాక్షిని ఇంచార్జ్ గా నియమించడం ఆనందంగా ఉందని అన్నారు.వైసీపీ కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టే ధీటైన నాయకుడు విరుపాక్షి అన్న అని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రవి గౌడ్,వీరదాసు,రమేష్ లు పాల్గొన్నారు.

### రా... కదలిరా..

# సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ అశోక్ యాదవ్

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 28న కర్నూలు జిల్లా పత్తికొండలో జరుగు రా..కదలిరా బహిరంగ సభకు ఆలూరు టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మ ఆద్వర్యంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు భారీగా తరలిరావాలని మండల కన్వీనర్ అశోక్ యాదవ్ తెలిపారు.బుధవారం ఆలూరులో టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీ,చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే నిరహార దీక్షలు తదితర తెదేపా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించిన మాజీ ఎంఎల్ఏ కోట్ల సుజాతమ్మ ఆద్వర్యంలో రా కదలిరా సభకు ఆలూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఎస్సీ సెల్ నాయకులు నరసప్ప, రఘురెడ్డి, భాస్కర్, నారాయణ, రంగయ్య, శేఖర్, రాముడు, దేవేంద్ర, రాము యాదవ్, అంజి, అంబన్న, కొమ్ము రామాంజి, నాగరాజు, లక్ష్మిపతి, రాఘవేంద్రరెడ్డి, రామాంజినేయులు, సోమశేఖర్ నాయుడు, బెట్టింగ్ రాజు, నాయక్, గుండన్న, రాజశేఖర్, గోపాల్, ఈరన్న, మనోహర్‌లు పాల్గొన్నారు.

**ఆలూరు టికెట్‌పై అపోహలు నమ్మవద్దు...**

ఆలూరు టిడిపి టికెట్‌పై పేటిఎం బ్యాచ్ చెప్పే మాటలు నమ్మవద్దని ఇంతవరకు రాష్ట్రంలో చంద్రబాబు టికెట్ ఎవ్వరికి డిక్లర్ చేయలేదని తెలుగుయువత నాయకులు రఘుప్రసాద్‌రెడ్డి అన్నారు.కొందరు స్వార్థ రాజకీయ నాయకులు ఆలూరులో టిడిపిని గత 25 ఏళ్లుగా గెలిపించుకోకుండా అడ్డుకుంటున్నారని వీరందరూ రాత్రి పాలకపక్ష నాయకులను కలిసివచ్చి పగలు టిడిపి పార్టీపై అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు.పార్టీలో బిసి నాయకులైన అచ్చెంనాయుడు,బి.టినాయుడు తదితర పేర్లును వాడుకొని రోజు టికెట్ వచ్చిందని చెబుతున్నారని ఈ నాయకులు చంద్రబాబు అరెస్టు అయినప్పుడు ఎక్కడికి వెళ్లారని ఎల్ఎల్‌సి కాలువలో నీరు లేక రైతులు అవస్థలు పడుతుంటే ఎక్కడికిపోయారని అన్నారు.బర్త్‌డే సమయాలలో రెండు కేక్‌లు తెచ్చి బాణాలు కాల్చి ఆర్భాటాలు చేస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకున్న పాలక నాయకులకు ఎదురొడ్డి నిలిచి అత్యధిక సంఖ్యలో ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను కోట్ల సుజాతమ్మ గెలిపించారని ఒక నాయకుడు తన సొంత ఊరులో వార్డు మెంబర్‌ను కూడా గెలిపించలేక పాలక పక్షాలకు భయపడి ఓటు వేయడానికి కూడా రాలేదన్నారు. కావున ప్రజలు అలోచించి సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఎదురొడ్డినిలిచే కోట్ల సుజాతమ్మ నాయకత్వాన్ని బలపరచాలని వారు కోరారు.

# నకిలీ విత్తనాలతో నట్టేట మునిగిన రైతన్న

**రైతును నట్టేట ముంచిన గణేష్ విత్తన వ్యాపారి షాపు యజమాని**
**2.50 ఎకరముభూమిలో వాటర్ మిలన్ విత్తన పంటసాగు..**
**రూ.1 లక్ష పదివేల రూపాయలు పెట్టుబడిపెట్టా..**
**70రోజులైన పంట దిగుబడి రాలేదు..**
**పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు ఆవేదన**



పొలంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమ్మైన పెద్దకడుబూరు గ్రామానికి చెందిన మాల దాసరి అనే రైతు ఎమ్మిగనూరు పట్టణం లోని గణేష్ హైబ్రీడ్ షాపులో కొనుగోలు చేసిన నకిలీ పుచ్చకాయ విత్తనాల వల్ల పంట సరిగ్గా రాక నష్టపోయామని బుధవారం విలేక రుల ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు తెలిపిన వివరాల మేర కు..గత సంవత్సరం నవంబర్ 13వ తేదిన రూ.12వేలు రుపాయ లతో ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న గణేష్ హైబ్రిడ్ షాప్ లో పుచ్చకాయల విత్తనాలు కొనుగోలు చేసి తన కున్న 2.50 ఎకరముల భూమిలో విత్తనాలు నాటుకోవడం జరిగిందని తెలిపారు. అయితే పంట సాగుకు దాదాపు ఒక లక్ష




పుచ్చకాయల విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు

రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పొలంలో పంట సాగు చేసి నేటికి 70 రోజులకు పైగా అవుతున్న పొలంలో పుచ్చకాయలు చిన్న చిన్నగా అతి తక్కువ సైజులో ఉన్నాయని, కాయలు లావుగా పెరగకుండా చిన్న చిన్నగా ఉండటంతో తీవ్ర నష్టపోయానని,నకిలి విత్తనాలతో తాను తీవ్రంగా మోస పోయాయని రైతు విలేకరుల ముందు తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ఈ విష యాన్నినకిలి విత్తనాలు అంటగట్టిన ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న గణేష్ హైబ్రీడ్ విత్తన వ్యాపారిని నిలదీయడం జరిగిందన్నారు. అయితే షాపు యజమాని సరైన సమాధానం చెప్పకపోవడంతో నకిలి విత్తనాలతో మోసం చేసిన గణేష్ హైబ్రీడ్ విత్తన వ్యాపారి పై మంత్రాలయంలో ఉన్న ఉద్యానవన శాఖ అధికారికి వినతిపత్రం అందించి గణేష్ హైబ్రిడ్ షాప్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు జరిగిన నష్టానికి పరిహారాన్ని గణేష్ విత్తనాలు విక్రయ వ్యాపారి వద్ద నుంచి ఇప్పించాలని. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను కోరినట్లు రైతు తెలిపాడు.

# అసత్యపు ఆరోపణలు చేయడం తగదు..ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- **సీజనల్ నేతలు అంటూ అఖిలప్రియ పై కౌంటర్**
- **అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేస్తా– బాలిక మృతిపై ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి వివరణ**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** తమపై బురద చల్లేందుకు సీజనల్ నేతలు అంటూ మా అక్క భూమా అఖిలప్రియ అని సంబోధిస్తూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చురకలు అంటిస్తూ పాండురంగాపురం వెంచర్‌లో మైనర్ బాలిక మృతిపై చేసిన అసత్యపు ఆరోపణలకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం పట్టణంలోని పద్మావతి నగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శిల్పా వెంచర్‌లో మేస్త్రీ ఏసోబు కూతురు ఇంట్లో ఉరేసుకోవడం దురదృష్టకర



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మని అన్నారు. ఏసోబును ఇంట్లో మనిషిలాగా ఉండేవాడని పనిమీద భార్యభర్తలు బయటకు వెళ్లడంతో బాలిక ఉరేసుకోవడం జరిగిందన్నారు. బాలికపై అత్యాచారం చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆమె పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ వెంచర్‌లో నిర్మాణాలకు చరణ్ అనే అతనికి కాంట్రాక్ట్ అప్పజెప్పామన్నారు. జస్టిస్ చౌదరిలాగా ఆమె వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే విడ్డూరంగా ఉందని తెలిపారు. నిరాదారణ ఆరోపణలకు తాను స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఆమె మంత్రిగా ఉన్న సమయంలో కూడా తనపై కేసును నమోదు చేయిస్తే అప్పటి ఎస్పీ తనకు క్లీన్‌చిట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఎక్కడ చావులు జరిగినా శిల్పా కుటుంబమే కారణం అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమపై బురదచల్లేందుకు ఇటువంటి వ్యాఖ్యలు పరిపాటిగా మారిందన్నారు. బాలిక మృతి ఆత్మహత్యానా, హత్యానా అన్న విషయాలను పోలీసుల విచారణలో తేలుతుందన్నారు. ఎటువంటి విచారణకైనా తాను సిద్ధం అన్నారు. ఈసమావేశంలో మహానంది ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి, శరభారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటా: టీజీ భరత్

**– మౌర్య ఇన్‌లో టీజీ భరత్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా**



నిరుద్యోగ యువతీ, యువకులతో టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** యవతకు ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం మౌర్య ఇన్‌లో ఆయన ఆధ్వర్యంలో 18కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. వెయ్యిమందికిపైగా యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకొని హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలులో నిరుద్యోగులు పెరిగిపోతున్నారన్నారు. తమ కంపెనీ ద్వారా ఇప్పటికే వేలాదిమందికి ఉద్యోగవకాశాలు కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత కృషి చేసి కర్నూలులో పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. హెచ్‌డీఆర్‌యూత్ శివ, జనార్ధన్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** సాధారణ ఎన్నికల నేపథ్యంలో అన్ని అంశాలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణలో భాగంగా కలెక్టరేట్‌లో కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇది వరకే ఉన్న పీఎంయూలో ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.



పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రస్తుతం జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్నమౌలిక వసతుల వివరాల సమాచారం, వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, సీపీఓ హిమప్రభాకర్‌రాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసకుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

# జంతు వధ, మాంసం అమ్మకాలు నిషేధం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:**

జనవరి 26వతేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో మాంసం అమ్మకాలు నిషేధించినట్లు కర్నూలు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో అమ్మకాలు చేయకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎక్కడైనా మాంసం అమ్మకాలు నిర్వహిస్తే ఆ షాపుల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

# స్థానికులు వర్సెస్ స్థానికేతరులు

- **నంద్యాల వైసీపీలో సరికొత్త రాజకీయం**
- **అధికార పక్షంలో విపక్షం**
- **నాడు బొజ్జా..నేడు గోపవరం**
- **రెండు కుటుంబాల లక్ష్యం ఒక్కటే**
- **ఇద్దరి టార్గెట్ శిల్పా**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** అధికార వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయానికి తెర లేచింది. ఆ పార్టీ జడ్పీటీసీ, పాణ్యం నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ పరిశీలకుడు గోకుల్ క్రిష్ణారెడ్డి అధికార పక్షంలో విపక్ష నేతగా మారారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని రాజకీయ రంగంలో స్థానికులు మరియు స్థానికేతరుల మధ్య రాజకీయ అగ్గి రాజుకుంది. వైఎస్ఆర్‌సిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక బస్సు యాత్రలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు రేపిన దుమారం ఇంకా చల్లారనట్లుగా కనిపిస్తోంది. మోహన్‌రెడ్డి మాటలను స్థానికుల కోవలో గోకుల్ క్రిష్ణారెడ్డి గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. నంద్యాల నియోజకవర్గంలో స్థానికేతరుల పెత్తనం ఏమిటని ప్రశ్నించడం మొదలు పెట్టారు. స్థానికులను ఒక గూటి కిందకు తెచ్చేందుకు నంద్యాలలో ఆత్మ గౌరవ యాత్ర పేరిట ర్యాలీకి నడుం బిగించారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. తన కార్యాలయం వద్ద శిల్పా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మాటల తూటాలను పేల్చారు. నంద్యాల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ వైసీపీ నాయకుడు, ప్రస్తుత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డితో పాటు గోకుల్ క్రిష్ణారెడ్డిని లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికగా ఘాటైన వ్యాఖ్యలు చేయడంతో అధికార పక్షంలో అసమ్మతి కనిపించింది. ఇప్పటివరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి సెగ బుసలు కక్కింది. 2002వ సంవత్సరంలో దివంగత మాజీ ఎంపీ బొజ్జా



నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

వెంకటరెడ్డి తనయుడు బొజ్జా దశరథ రామిరెడ్డి నవ నిర్మాణ సమితి పేరిట స్థానికులు, స్థానికేతరుల అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకొని రెండేళ్లు పోరాటం చేసిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా ఇపుడు గోపవరం గోకుల్ క్రిష్ణారెడ్డి అదే స్థానికులు, స్థానికేతరుల అంశాన్ని ప్రధానంగా చేపట్టారు. బొజ్జా, గోపవరం ఇరు కుటుంబాల లక్ష్యం శిల్పా కుటుంబంగా కనిపిస్తుంది. ఆనాడు శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాల రాజకీయాల్లోకి ప్రవేశించే సమయం కాగా, నేడు రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ఆత్మ గౌరవ యాత్ర పేరిట స్థానిక రాజకీయ నేతలు ప్రజల మద్ధతును గోకుల్ క్రిష్ణారెడ్డి కూడగట్టే ప్రయత్నం చేపట్టారు. సామాజిక బస్సు యాత్ర సభలో శిల్పా మోహన్‌రెడ్డి మాట్లాడిన మాటలకు అదే స్థాయిలో గోకుల్ క్రిష్ణారెడ్డి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఒకే పార్టీకి చెందిన రెండు కుటుంబాల మధ్య చలరేగిన వివాదంపై రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్వపక్షంలో తలెత్తిన విపక్షంపై మేజర్ న్యూస్ అందిస్తున్న కథనం ఇది...

నంద్యాల రాజకీయ చిత్ర పటంలోకి శిల్పా మోహన్‌రెడ్డి 2002వ సంవత్సరంలో వచ్చారు. 2004,2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. రెండోసారి గెలుపొందినపుడు దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆయనకు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. 2014లో ఆయన టీడీపీలో చేరి పోటీ చేసి దివంగత భూమా నాగిరెడ్డిపై ఓటమి పాలయ్యారు. 2017లో వైసీపీలో చేరి ఉప ఎన్నికల్లో భూమా బ్రహ్మానంద రెడ్డిపై పోటీచేసి రెండోసారి ఓటమిని చవిచూశారు. 2019 ఎన్నికల్లో శిల్పా మోహన్‌రెడ్డి తనయుడు శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డిని రాజకీయ రంగ ప్రవేశం చేయించారు. ఆ ఎన్నికల్లో శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భూమా బ్రహ్మానంద రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. నంద్యాల రాజకీయాల్లోకి శిల్పా మోహన్‌రెడ్డి ప్రవేశించే సమయంలో మాజీ ఎంపీ బొజ్జా వెంకటరెడ్డి తనయుడు బొజ్జా దశరథ రామిరెడ్డి నవ నిర్మాణ సమితి పేరిట స్థానికేతరులు నంద్యాల రాజకీయాల్లోకి రాకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. అప్పటి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ శిల్పా మోహన్‌రెడ్డికి 2004లో అవకాశం కల్పించడంతో నవ నిర్మాణ సమితి లక్ష్యం నెరవేరలేదు. తాజాగా నంద్యాల మండల జడ్పీటీసీ గోకుల్ క్రిష్ణారెడ్డి నవ నిర్మాణ సమితి స్థానంలో స్థానిక



జడ్పీటీసీ గోకుల్ క్రిష్ణారెడ్డి

ఆత్మ గౌరవాన్ని తీసుకొని వచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఆత్మ గౌరవం క్రింద బుధవారం ఓదార్పు యాత్రకు శ్రీకారం చుట్టారు. యాత్రకు పోలీసుల అనుమతి కోరినా నిరాకరించినట్లు తెలుస్తోంది. యాత్రను ముందుగా అనుకోవడంతో చేపట్టేందుకు గోకుల్ క్రిష్ణారెడ్డి ప్రయత్నించారు. పోలీసుల అనుమతి లేకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు పోలీసులకు గోకుల్‌కు మధ్య యాత్రపై వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసుల విజ్ఞప్తి మేరకు యాత్రను విరమించిన గోకుల్ తన సొంత కార్యాలయం బయట బైఠాయించారు.ఆ సమయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ రాయలసీమ, తెలంగాణ యాసలో పరోక్షంగా శిల్పా కుటుంబంపై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. యాత్రకు తరలి వచ్చిన అభిమానులను ఉద్దేశించి మాట్లాడే సమయంలో స్థానికేతరుల నుంచి ఎదురవుతున్న పరాభావాలను ఎండగట్టారు. ఎన్నో ఏళ్లనుంచి స్థానికేతరులను భుజాలకు ఎత్తుకొని మోస్తున్నామని ఇంకెన్నాళ్లు మోయాలంటూ వ్యాఖ్యానించారు. నంద్యాలలో స్వపక్షంలో విపక్షం సెగ పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. గోకుల్ క్రిష్ణారెడ్డి ఎక్కడ శిల్పా కుటుంబం పేరు ఎత్తకుండానే మాటలను తూటాల్లా సందిస్తున్నారు. శిల్పా మోహన్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలు ఇప్పటి వరకు గోకుల్ యాత్రపై నేరుగా స్పందించలేదు. నంద్యాల వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా గోకుల్‌ను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేధికగా టార్గెట్ చేస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి. మేనల్లుడు అయిన గోకుల్‌కు అండగా నిలిచేందుకు గంగుల కుటుంబం ఒక్క తాటిపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తుండడం కొసమెరుపు..